సాక్షి
ప్రకాశం

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024

బాబు గారడీ..
స్మార్ట్ దోపిడీ



ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు వద్దన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. జిల్లాలో 14 లక్షల కలెక్షన్లపై స్మార్ట్ మీటర్ల ప్రభావం పడనుంది. - 8లో..



కళ్లులేని కబోదిలా కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం కళ్లులేని కబోదిలా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/21

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మానవ హక్కుల సంఘం డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: అంతర్జాతీయ మానవహక్కుల సంఘం డైరీని శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రేరణ, గ్రామసభ, సమాచార హక్కు చట్టం, పోలీసులు, వినియోగదారుల రక్షణ చట్టం తదితర ఐదు అంశాలతో రూపొందించిన డైరీని ప్రకాశం భవనంలో దక్షిణ భారత వర్కింగ్ చైర్మన్ సయ్యద్ సుభాని.. కలెక్టర్‌కు చూపి వివరించారు. కార్యక్రమంలో ఎం మాధవి, యు సుధాకర్, డీ రవికుమార్, ఎస్‌డీ జిలాని బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



దివ్యాంగుల కమిటీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలోని అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా వీల్‌చైర్‌లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం గ్రీవెన్స్ హాలులో దివ్యాంగుల చట్టం 2016పై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో దివ్యాంగులు ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చినప్పుడు వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. దివ్యాంగుల చట్టం పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సభ్యులతో చట్టం అమలుపై సమీక్ష చేస్తామన్నారు. దీనిలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ రుణాల మంజూరుకు చర్యలు

ఒంగోలు వన్‌టౌన్: ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ కుమార్ అన్నారు. ఒంగోలు వచ్చిన ఆయన శనివారం ప్రగతి భవన్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ రుణాల రికవరీలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా ఏళ్ల తరబడి పడి ఉన్న డ్రైన్ క్లీనింగ్ యంత్రాలకు మరమ్మతులు చేసి తిరిగి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఈవో నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో కానిస్టేబుల్ రౌడీయిజం

- ఆరోగ్యం బాగాలేని వ్యక్తిపై దాడి



కానిస్టేబుల్ దాడిలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

ఒంగోలు టౌన్: ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసు కానిస్టేబుల్ రెచ్చిపోయాడు. బాధితుడి కథనం ప్రకారం.. ఒంగోలుకు చెందిన మార్క్స్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆర్టీసీ బస్టాండ్‌లోని బెంచీపై పడుకొని ఉన్నాడు. అప్పుడే అటుగా వచ్చిన కానిస్టేబుల్ అకారణంగా అతడిపై దాడికి దిగాడు. లాఠీతో వాతలు పడేలా చితకబాదాడు. ఆరోగ్యం బాగాలేక ఇక్కడ పడుకున్నానని చెబుతున్నా పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. చుట్టూ ఉన్న ప్రయాణికులు ప్రశ్నించినా వారిని కూడా బెదిరించినట్లు చెబుతున్నారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విచక్షణ మరిచి ఇష్టం వచ్చినట్లు దాడి చేసిన పోలీస్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత ఇసుక రూ.45వేలు

- ఉచితం లేదు.. అంతా బాదుడే
- ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో తరలించకుండా అధికార యంత్రాంగంతో బెదిరింపులు
- పనులు లేక అల్లాడుతున్న భవన నిర్మాణ కార్మికులు

దర్శిలో స్టాక్ యార్డులు ఏర్పాటు చేసి దోపిడీ

ఉచిత ఇసుక ధర టన్ను జస్ట్ రూ.1,230 మాత్రమే! ఫ్రీ అంటున్నారు.. మరి డబ్బులేమిటంటారా? అదే చంద్రబాబు ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీ స్పెషాలిటీ!!



స్టాక్ పాయింట్‌లో కుప్పపోసిన ఇసుక

దర్శి: నగర పంచాయతీ పరిధిలోని కురిచేడు రోడ్డు సాయినగర్ – చలివేంద్రం మధ్యలో ఏర్పాటైన ఇసుక స్టాక్ యార్డ్‌లో ఇసుక కొనుగోలు చేసేవారికి టన్ను రూ.1,230 చొప్పున విక్రయించాలని ఫ్లెక్సీ వేసి మరీ నిర్ణయించారు. దీని ప్రకారం వినియోగదారుడు 30 టన్నుల లారీ ఇసుకను కొనాలంటే రూ.36,900 చెల్లించాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు దూరాన్ని బట్టి టన్నుకు రూ.200 వరకు అదనంగా బాడుగ చెల్లించాలి. అంటే 30 టన్నులకు బాడుగ రూపంలో అదనంగా రూ.6 వేలు ఖర్చు అవుతోంది. నిల్వ చేసేందుకు స్థలం సరిపోక లారీ ఇసుకను విడతల వారీగా తెచ్చుకుంటే 30 టన్నులకు రూ.45 వేల వరకు వినియోగదారులు చెల్లించాల్సి వస్తోంది. ఇలా నిస్సిగ్గుగా ఫ్లెక్సీలు వేసి ఆంధ్రప్రదేశ్ ఇసుక నిర్వహణ వ్యవస్థ స్టాక్ యార్డ్ పేరుతో సాగిస్తున్న దందాను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో టన్ను ఇసుక రూ.900కే లభ్యం కాగా 30 టన్నుల ఇసుక లారీకి రూ.27 వేలు చెల్లిస్తే నేరుగా ఇంటికే వచ్చేది. ఇప్పుడు ఉచిత ఇసుక అంటూ రూ.18 వేలు అదనంగా దోచుకుంటున్నారు. దీంతో ఇసుక ధరలు భరించలేక జిల్లాలో భవన నిర్మాణ పనులు స్తంభించాయి. ఇసుక కొరతతో కార్మికులు ఉపాధి కోల్పోయి అల్లాడుతున్నారు.

మావద్దే కొనాలి.. లేదంటే బండి సీజ్!

ఇసుక కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తులు అధికారులను అడ్డు పెట్టుకుని తమ వద్దే కొనుగోలు చేయాలని షరతులు పెడుతున్నారు. ఎవరైనా బయట నుంచి నేరుగా ఇసుక బుక్ చేసుకుని తరలించేందుకు ప్రయత్నిస్తే మైనింగ్ అధికారుల ద్వారా కేసులు బనాయించి లారీలను సీజ్ చేయిస్తామని బెదిరిస్తున్నారు. సరుకులు అన్ లోడింగ్ అనంతరం ఖాళీగా తిరిగి వెళ్లిపోయే వాహనాల్లో తక్కువ బాడుగ చెల్లించి ఇసుకను తెచ్చుకునే వారిని బెదిరిస్తూ, కేసులు నమోదు చేస్తామని వాహనాలను



ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

ఇసుక మాఫియా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రిటన్ వాహనాల ద్వారా నేరుగా నెల్లూరు నుంచి బుక్ చేసుకుని ఇసుక తెచ్చుకుంటే రూ.800 నుంచి రూ.850కే సరఫరా చేస్తున్నారు. అయితే వాటిని అడ్డుకుంటున్నారు. ఇటీవల కొన్ని వాహనాలను నిలిపివేసిన అధికారులు మరోసారి ఇసుక లోడ్‌తో వస్తే రెవెన్యూ కార్యాలయానికి తరలించి కేసులు పెడతామని హెచ్చరించినట్లు సమాచారం. ట్రాక్టర్లతో వాగులు, వంకల్లో ఇసుక తెచ్చుకునే వారిని కూడా అడ్డుకోవడంతో భవన నిర్మాణాలు ఆగిపోతున్నాయి.

ఆర్నెళ్లలో ఎంత తేడా!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్నెళ్లలో రెండుసార్లు ఇసుక ధరలు మారాయి. ఒంగోలులో ఆర్నెళ్ల కిత్రం టన్ను ఇసుక ధర రూ.650 ఉండగా ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేసిన యార్డ్‌లలో రూ.980గా నిర్ణయించారు. గిద్దలూరులో గతంలో రూ.700 ఉండగా నూతన ధర రూ.1,200కి పెరిగింది. మార్కాపురంలో రూ.900 నుంచి రూ.1,280కి, యర్రగొండపాలెంలో రూ.1,000 నుంచి రూ.1,500కి, కనిగిరిలో రూ.700 నుంచి రూ.980కి, దర్శి, పొదిలిలో రూ.800 నుంచి రూ.1,230కి గత ఆర్నెళ్లలో టన్ను ఇసుక ధరలు పెరిగాయి.



ప్రభుత్వం ప్రస్తుతం ఇసుక రేట్లు మార్చిన పట్టిక

ఐదు మండలాల్లో..

దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నిర్మాణాలకు యార్డు నుంచి మాత్రమే ఇసుకను కొనుగోలు చేయాలని ఆదేశిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను తరలించకుండా అడ్డుకుని ధరలు పెంచి నిర్మాణాలు చేపట్టకుండా నడ్డి విరుస్తున్నారని నిర్మాణాలు చేపట్టే సామాన్యులు వాపోతున్నారు.

టీడీపీలో ఆరని వర్గపోరు



త్రిపురాంతకం మండలం నుంచి ఎరిక్షన్‌బాబుకు వ్యతిరేకంగా అమరావతి తరలి వెళ్తున్న టీడీపీ అసమ్మతి నాయకులు

- యర్రగొండపాలెంలో రెండువర్గాలుగా చీలిన పార్టీ
- అసమ్మతితో అమరావతికి టీడీపీలో ఒక వర్గం
- నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుపై ఫిర్యాదు
- నెల రోజుల్లో ఇది మూడోసారి

త్రిపురాంతకం: తెలుగుదేశం పార్టీ యర్రగొండపాలెం నియోజకవర్గంలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. నియోజకవర్గం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు వైఖరిపై వ్యతిరేక వర్గం అధిష్టానానికి పలు దఫాలుగా ఫిర్యాదు చేస్తోంది. ఇప్పటికే రెండు పర్యాయాలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. తాజాగా శనివారం నియోజవర్గానికి చెందిన టీడీపీ నేతలు వాహనాల్లో అమరావతికి వెళ్లారు. పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తమ గోడు విన్నవించుకుని సముచిత న్యాయం చేయాలని అసమ్మతి నాయకులు మొరపెట్టుకున్నారు. త్రిపురాంతకం నుంచి భారీగా 42 వాహనాల్లో సుమారు 200 మందికి పైగా టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర నాయకుడు వర్ల రామయ్యలను కలిశారు. అధికారంలోకి వచ్చినా పార్టీని నమ్ముకున్న వారికి ఎలాంటి ప్రయోజనం లేదని వారు వాపోయారు. యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఎరిక్షన్‌బాబు అత్యవసర సమయంలో కనీసం కార్యకర్తలు, నాయకులు ఫోన్‌చేసినా పలకడం లేదని ఆరోపించారు. పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత లేకుండా ఇతరులకు పనులను కట్టబెట్టారని ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అదే విధంగా నియోజకవర్గంలోని ఎస్ఎస్ ట్యాంకుల నిర్వహణ ఎరిక్షన్‌బాబు స్వంత ప్రాంతానికి చెందిన వారికి కేటాయించారని, పార్టీ వారిని విస్మరించారని ధ్వజమెత్తారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న తమకు ఎలాంటి గుర్తింపు ఇవ్వడంలేదని, తీవ్రంగా నష్టపోయామన్నారు. పార్టీలో సముచిత స్థానం కల్పించాలని టీడీపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. అమరావతికి వెళ్లిన వారిలో ఊట్ల సీతయ్య, యం చిన్న నాసరరెడ్డి, దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, మన్నెయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు ఉన్నారు. వీరితో పాటు జనసేన నాయకుడు బీమిశెట్టి వెంకటేశ్వర్లు ఉన్నారు.



త్రిపురాంతకం నుంచి తరలి వెళుతున్న వాహనాలు

ఆరు నెలల్లో 440 దొంగతనాలు..
581 మిస్సింగ్‌లు

- వార్షిక నేర నివేదిక విడుదల చేసిన ఎస్పీ దామోదర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లాలో గడిచిన ఆరు నెలల్లో 440 దొంగతనాలు జరిగాయని, 581 మంది మిస్సింగ్ కేసులు నమోదయ్యాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. గత ఆరు నెలల్లో 440 దొంగతనాలు జరగగా రూ.1.7 కోట్లు చోరీ కాగా రూ.1.4 కోట్లు రికవరీ చేసినట్లు తెలిపారు. 80 శాతం రికవరీ చేసినట్లు చెప్పారు. 220 మోటారు బైకు చోరీ జరిగినట్లు ఫిర్యాదులు రాగా వాటిలో 110 కేసులను గుర్తించినట్లు వివరించారు. రాగితీగలకు సంబంధించిన 91 కేసుల్లో 56 కేసుల్లో నిందితులను అరెస్టు చేశామన్నారు. అలాగే 2024లో ఇప్పటి వరకు 581 మిస్సింగ్ కేసులను నమోదయ్యాయని తెలిపారు. వాటిలో 22 మంది బాలలు, 114 మంది బాలికలు, 139 పురుషులు, 306 మంది మహిళలు ఉన్నారన్నారు. ఈ కేసుల్లో 478 కేసులను ట్రేస్ చేసినట్లు తెలిపారు. 18 మంది బాలలు, 104 మంది బాలికలు, 104 మంది పురుషులు, 252 మంది మహిళలను ట్రేస్ చేశామన్నారు. ఇందుకుగాను జిల్లా వ్యాప్తంగా నాలుగు స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసి ప్రతి డివిజన్‌కు ఒక ఎస్ఐ ర్యాంకు అధికారిని నియమించినట్లు వెల్లడించారు. మిస్సింగ్ కేసుల్లో 82 శాతం కేసులను ఛేదించినట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించినట్లు వివరించారు. 2024 సంవత్సరంలో 358 ప్రమాదాల్లో 375 మంది దుర్మరణం పాలయ్యారని, 484 ప్రమాదాలకు గాను 858 మంది గాయపడ్డారని తెలిపారు. గత ఏడాదికంటే ఈ ఏడాది 6.72 శాతం మరణాలు తగ్గాయన్నాయన్నారు. 4160 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా రూ.58,56,250 జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే ట్రాఫిక్ ఉల్లంఘనకు సంబంధించి 1,14,770 కేసులకు గాను రూ.2,45,35,823 జరిమానా విధించారన్నారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 13,963 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మహిళలపై మొత్తం 807 కేసులు నమోదయ్యాయని, వాటిలో 20 అత్యాచారం కేసులు, 697 వేధింపుల కేసులు, 90 పోక్సో కేసులు నమోదైనట్లు చెప్పారు. అంతకుముందుతో పోలిస్తే 22.84 శాతం తగ్గుదల నమోదైందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఈ ఏడాది భారీ తగ్గుదల నమోదైనట్లు తెలిపారు. కేవలం 1 ఎస్సీ, ఎస్టీ హత్య జరిగిందని, 7 అత్యాచారం కేసులు నమోదయ్యాయని, 134 వేధింపుల కేసులు నమోదైనట్లు వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే 36 శాతం కేసులు తగ్గాయని చెప్పారు. గంజాయి విక్రయాలు, సరఫరాకు సంబంధించి 28 గంజాయి కేసులు నమోదు కాగా 123 మందిని అరెస్టు చేసి వారి నుంచి 259.896 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 2024లో 41 శాతం మర్డర్లు, 23 శాతం కిడ్నాప్‌లు, 21 శాతం అత్యాచారాలు, 44 శాతం క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ కేసులు, 47 శాతం చీటింగ్ కేసుల్లో తగ్గుదల కనిపించిందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి పోలీసు స్టేషన్‌కు ఒక డ్రోన్ సమకూర్చడానికి తగిన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రెండు నెలల్లో జిల్లాలో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు సాంకేతికతను ఉపయోగించుకోనున్నట్లు వివరించారు.

2025లో కొత్త పోలీసింగ్‌కు శ్రీకారం..

రానున్న కొత్త ఏడాది జిల్లాను నేర రహితంగా తీర్చిదిద్దేందుకు కొత్త పోలీసింగ్‌కు శ్రీకారం చుట్టనున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడుతూ... ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, బి.లక్ష్మీ నారాయణ, నాగరాజు, మహేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1 నుంచి సదరం సర్టిఫికెట్ల జారీ నిలిపివేత

ఒంగోలు టౌన్: జనవరి 1వ తేదీ నుంచి సదరం సర్టిఫికెట్ల జారీ నిలిపేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సదరం స్లాట్ బుకింగ్, సదరం పరీక్షలు, క్యాంపులు నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొత్తం సదరం ప్రక్రియను నిలిపేశారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సదరం పరీక్షల కోసం జీజీహెచ్‌కు రావద్దని కోరారు. పెన్షన్ సర్టిఫికెట్లలో సవరణలు, తొలగింపులను కూడా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

ఎస్పీ ఆఫీసులో డిష్యూం డిష్యూం

ఒంగోలు టౌన్: ఎస్పీ కార్యాలయంలోనే ఘర్షణ జరగడం పోలీసు శాఖలో కలకలం సృష్టించింది. ఎస్పీ కార్యాలయంలో సీసీగా విధులు నిర్వహిస్తున్న నారాయణకు ఆయన దగ్గర ఉండే ఏఆర్ కానిస్టేబుల్ గాంధీకి మధ్య శుక్రవారం రాత్రి ఒక ఫైలు పెండింగ్ విషయంలో వాదన జరిగింది. దీంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. ఈ క్రమంలో ఏఆర్ కానిస్టేబుల్ గాంధీ సీసీ నారాయణను నెట్టడంతో కిందపడిపోయినట్లు తెలుస్తోంది. తనను దురుసుగా నెట్టడమే కాకుండా అవమానపరచాడని ఆయన తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం కేసు నమోదు చేసిన సీఐ అజయ్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా సీసీ నారాయణపై ఏఆర్ కానిస్టేబుల్ చేయిచేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఒక డాక్టర్, ముగ్గురు స్టాఫ్‌నర్సుల ఉద్యోగాలకు నోటిఫికేషన్

ఒంగోలు టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా మార్కాపురం జీజీహెచ్‌లో పల్లియేటివ్ కేర్ యూనిట్‌లో విధులు నిర్వర్తించేందుకు ఒక ఫిజిషియన్ (డాక్టర్), ముగ్గురు స్టాఫ్ నర్సు ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30 నుంచి జనవరి 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. దరఖాస్తుతోపాటుగా ధ్రువీకరణ పత్రాల నకలు కాపీలను జత చేయాలని, గడువు తరువాత దరఖాస్తులను ఎట్టి పరిస్థితిలోనూ స్వీకరించేది లేదని తెలిపారు.

అడిషనల్ క్వాంటమ్ తిరిగి పెంచాలి



75 సంవత్సరాలు నిండిన ప్రభుత్వ పెన్షనర్లను సత్కరిస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

- పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం
- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు
- 75 ఏళ్లు నిండిన పెన్షనర్లకు సత్కారం

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ పెన్షనర్లకు తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను తిరిగి పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానిక ఎన్‌జీఓ హోం సమావేశ మందిరంలో సంఘం సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు అన్నీ విధాలుగా సంఘం పనిచేస్తుందన్నారు. 2018 జులై నుంచి ఇవ్వాల్సిన డీఆర్ అరియర్స్, 11వ పే రివిజన్ అరియర్స్‌ను వీలైనంత త్వరగా ప్రభుత్వం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. 12వ పీఆర్‌సీతో పాటు ఐఆర్ ప్రకటించాలని కోరారు. పెన్షనర్లు బతికుండగానే అరియర్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. వయోవృద్ధులైన పెన్షనర్లకు హెల్త్‌కార్డుల ద్వారా క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అన్నీ హాస్పిటల్స్‌లో అందేలా ప్రభుత్వం చూడాలన్నారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటానికి పెన్షనర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తొలుత జాతీయ జెండాను ఎగురవేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. దీనిలో ఖజానా శాఖ డీడీ జగన్నాథరావు, జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంకిరెడ్డి, సుబ్బారావు, ఇతర నాయకులు ఎం రామకృష్ణ, కే రామారావు, ఒంగోలు ఎస్‌టీవో రాజ్యలక్ష్మి, ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం 75 సంవత్సరాలు నిండిన 30 మంది పెన్షనర్లకు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

తప్పిపోయిన వారు..క్షేమంగా ఇంటికి



తప్పిపోయిన వారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తప్పిపోయిన, కిడ్నాప్‌నకు గురైన బాలబాలికలు, మహిళలు, పురుషులను గుర్తించి వారిలో 42 మందిని శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి ఎస్పీ ఏఆర్ దామోదర్ వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. తొలుత జిల్లా పోలీసు కార్యాలయంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మిస్సింగ్ కేసులను త్వరగా ఛేదించేందుకు జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రాష్ట్రంలోని చుట్టుపక్కల ప్రాంతాలే కాకుండా అస్సాం తదితర రాష్ట్రాల్లో కూడా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీలు శ్రీనివాసరావు, నాగరాజు, మహేశ్వరరావు, లక్ష్మీ నారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

● డ్వామా పీడీ జోసఫ్ కుమార్




సంతనూతలపాడులో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్ కుమార్

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోకులాల షెడ్ల నిర్మాణ పనులను జనవరి 10వ తేదీలోగా పూర్తి చేసేందుకు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది చర్యలు చేపట్టాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్ కుమార్ ఆదేశించారు. శనివారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ మండల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సంతనూతలపాడు మండలంలో 53 షెడ్లు గోకులాల కింద మంజూరైనట్లు చెప్పారు. మండలానికి ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్ ప్రకారం అమృత సరోవర్ పథకంలో భాగంగా అన్ని పంచాయతీలలో గ్రామాలకు దగ్గరలో ఉన్న చెరువులను అభివృద్ధి చేసుకోవాలని పీడీ తెలిపారు. మండలంలో ఉపాధి పనులను వచ్చేసారికి పెంచాలని సూచించారు. సమావేశానికి సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు అధ్యక్షత వహించగా, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ పి.వెంకటస్వామి, స్పెషల్ ఏపీవో నాగేశ్వరరావు, ఎంఎస్ టి.సుబ్బారావు, మండల ఏపీఓ కే వాసంతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మద్దులూరు పంచాయతీ ఆకస్మిక తనిఖీ...

సంతనూతలపాడు మండలంలోని మద్దులూరు గ్రామ పంచాయతీని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోకులాల షెడ్లు మంజూరైన 8 మంది లబ్ధిదారులతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. షెడ్ల నిర్మాణ పనులు నెమ్మదిగా సాగడానికి గల కారణాలడిగి తెలుసుకున్నారు. షెడ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని పీడీ ఆదేశించారు.

బాబు గారడీ.. స్మార్ట్ దోపిడీ..!



- స్మార్ట్ మీటర్లు బిగించి విద్యుత్ చార్జీల భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర
- గత ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని చంద్రబాబు, లోకేష్ పిలుపు
- అధికారంలోకి వచ్చాక సైలెంట్‌గా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఆదేశాలు
- జిల్లాలో 14 లక్షల కనెక్షన్లపై స్మార్ట్ మీటర్ల ప్రభావం

చీమకుర్తి: స్మార్ట్ మీటర్ అనే మాట వింటేనే గత ఎన్నికలకు ముందు నారా చంద్రబాబు, లోకేష్ ఎగిరిపడ్డారు. మరో అడుగు ముందుకేసి స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండంటూ గత ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు పిలుపునిచ్చారు. అధికారంలోకి రామనుకుని చెప్పారో.. లేక అధికారంలోకి వస్తే ఎలాగైనా మాటమార్చగలమనే నైపుణ్యం తమకు ఉందనుకున్నారోగానీ.. స్మార్ట్ మీటర్లపై చంద్రబాబు, లోకేష్ చెప్పిన మాటలు ఇప్పుడు రైతులు, వ్యాపారులు, ప్రజలను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. తీవ్ర విమర్శలకు తావిస్తున్నాయి.

ఇప్పటికే షాక్ కొడుతున్న కరెంటు బిల్లులు...

కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ఇప్పుడున్న మీటర్ల ద్వారా వస్తున్న కరెంటు బిల్లులే షాక్ కొట్టే విధంగా ఉన్నాయని విద్యుత్ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు నిండకముందే ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారం మోపుతున్నారు. కరెంటు బిల్లులు పెంచి తమను బాదేస్తున్నారంటూ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వాడుకుంటున్న కరెంటుకు, వస్తున్న బిల్లుకు పొంతన లేకుండా ఇష్టమొచ్చినట్లు దోచేస్తున్నారని అందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనిట్ రేట్లు నిలకడగా ఉండకపోవడం, లేట్ ఫీజు, రకరకాల అపరాధ రుసుంల పేరుతో వాడుకున్న కరెంటుకు వేసే బిల్లు కంటే అదనంగా వసూలు చేసే బిల్లులే ఎక్కువగా ఉంటున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఏది ఏమైనా నెలంతా వాడుకున్న తర్వాత వెసులుబాటు చూసుకుని కరెంటు బిల్లులు చెల్లించేందుకు అనుకూలంగా ఉన్న ప్రస్తుత విధానాన్ని కాదని స్మార్ట్ మీటర్ల పేరుతో రానున్న రోజుల్లో వాడుకునే కరెంటుకు ముందుగానే ప్రీపెయిడ్ విధానంలో డబ్బు వసూలు చేసే కుట్రకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.

జిల్లాలో 14 లక్షల మీటర్లు...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, దర్శి, కందుకూరు, అద్దంకి, కనిగిరి, చీరాల డివిజన్లలో మొత్తం 14 లక్షల విద్యుత్ మీటర్లు ఉన్నాయి. వాటిలో చీరాల, అద్దంకి డివిజన్లలో ఉన్న కనెక్షన్లను బాపట్ల జిల్లా పరిధిలోని అధికారులు పర్యవేక్షిస్తుండగా, మిగిలిన డివిజన్లలోని కనెక్షన్లను మాత్రం ప్రకాశం జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఆయా డివిజన్లలోని కనెక్షన్లను డొమెస్టిక్, కమర్షియల్, పరిశ్రమలు, ప్రభుత్వ, వ్యవసాయ, ఆలయాలు, పాఠశాలలు, తాత్కాలిక విభాగాలు కలిపి మొత్తం 8 కేటగిరీలుగా విభజించారు. వాటిలో అత్యధికంగా నివాసాలకు వాడుకునే డొమెస్టిక్ కేటగిరీ కింద దాదాపు 10 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తర్వాతి స్థానంలో అత్యధికంగా కేటగిరీ 5 కింద సుమారు 2 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. కేటగిరీ–2 కింద పరిశ్రమలకు సంబంధించి ఒక లక్ష విద్యుత్ కనెక్షన్లు, ప్రభుత్వ కార్యాలయాల కేటగిరీ–4లో 19 వేలు, ఆలయాలు, పాఠశాలలు, తాత్కాలిక విభాగాలలో కలిపి మరో 75 వేల కనెక్షన్లు ఉన్నాయని అంచనా.

ప్రాధాన్యతా క్రమంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం...

మొత్తం 8 కేటగిరీలుగా ఉన్న విద్యుత్ మీటర్లలో ప్రాధాన్యతా క్రమంలో స్మార్ట్ మీటర్లు అమర్చమని జిల్లా స్థాయి అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం తొలుత కమర్షియల్ కేటగిరీలలో ఉన్న కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలోని దాదాపు లక్ష కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లకు చకచకా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. ఆ తర్వాత చీమకుర్తి, ఒంగోలు, చీరాల, బల్లికురవ, మార్టూరు ప్రాంతాలలో ఎక్కువగా ఉన్న పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు బిగించే ఏర్పాట్లు చేయనున్నారు. తదుపరి డొమెస్టిక్, వ్యవసాయం అంటూ ప్రాధాన్యతా రంగాల వారీగా స్మార్ట్ మీటర్లు బిగించనున్నారు. మొత్తం మీద రానున్న ఐదారు నెలల్లోపే జిల్లాలోని అన్ని కేటగిరీలకు స్మార్ట్ మీటర్లు బిగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

స్మార్ట్ మీటర్లపై ఎన్నో అనుమానాలు...

గతంలో ఉన్న పాత మీటర్ల ద్వారా నెలంతా విద్యుత్ వాడుకున్న తర్వాత కరెంటు బిల్లులు వస్తే ఇంట్లో డబ్బులు ఉండే వెసులుబాటును బట్టి బిల్లు చెల్లించే అవకాశం ఉండేది. ఒక వేళ కరెంటు మీటర్లకు రిపేరు వచ్చినా స్థానికంగా ఉన్న వారిని పిలిపించుకుని వెంటనే చేయించుకోవడం ద్వారా గంటల వ్యవధిలోనే సమస్య పరిష్కారమయ్యేది. కానీ, స్మార్ట్ మీటర్లు బిగిస్తే నెల మొత్తం మీద ఎంత కరెంటు వాడుకుంటామో తెలియకుండానే ప్రీపెయిడ్ రీచార్జి పేరుతో వినియోగదారుల నుంచి ముందుగానే డబ్బు లాగేసుకునే కుట్ర జరుగుతోంది. ఒక వేళ ముందుగానే ప్రీపెయిడ్ ద్వారా రీచార్జి చేసుకుంటే.. కేటాయించిన యూనిట్లు మొత్తం వాడుకోకపోతే ఆ తర్వాత నెలకు వాడుకునే వెసులుబాటు ఉంటుందా..? లేక మధ్యలోనే రీచార్జి అయిపోతే రీచార్జి చేయడం ఎలా..? ఒక వేళ రీచార్జి అయిపోయి అనుకోకుండా డబ్బు అందుబాటులో లేకపోతే ఎలా..? చీకట్లోనే మగ్గిపోవాల్సిందేనా..? అంటూ వినియోగదారుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాటిని ఎలా పరిష్కరిస్తారో కనీస సమాచారం లేకుండా, ఏమాత్రం అవగాహన కల్పించకుండా విద్యుత్ శాఖ వారు స్మార్ట్ మీటర్లు బిగించుకుంటూ పోవడాన్ని వినియోగదారులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని చెప్పారు



గత ఎన్నికలకు ముందు అధికారంలోకి రావడం కోసం ఓటర్లను ఆకర్షించేందుకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలకొట్టమని చంద్రబాబు పిలుపునిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక చంద్రబాబే స్మార్ట్ మీటర్లను త్వరగా ఏర్పాటు చేయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. అధికారంలోకి రాకముందు ఒకలా, వచ్చిన తర్వాత ఇంకోలా చెప్పడం ప్రజలను మోసం చేయడమే అవుతుంది.

– దాసరి రవి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర బాధ్యుడు

ముందుగానే డబ్బు వసూలు చేయడం మంచిది కాదు



ఇప్పటి వరకు కరెంటు ఎంత వాడుకున్నారో అంతకే నెల రోజుల తర్వాత బిల్లు వస్తే గడువు తేదీలోగా చెల్లించే అవకాశం ఉంది. కానీ, స్మార్ట్ మీటర్ల వలన ఎంత వాడుకుంటారో తెలియకుండానే ముందుగానే ప్రీపెయిడ్ ద్వారా వినియోగదారుల నుంచి డబ్బు గుంజుకుంటారు. దీనివలన వినియోగదారులపై అదనపు భారం పడే ప్రమాదం ఉంది.

– ఇస్తర్ల శంకర్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, సంతనూతలపాడు నియోజకవర్గం

వ్యతిరేకత రాకుండా టూ ఇన్ వన్ మీటర్లు అంటూ మాయ...

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు టూ ఇన్ వన్ మీటర్లుగా స్మార్ట్ మీటర్లు పనిచేస్తాయంటూ ప్రచారం చేస్తున్నారు. అలాంటప్పుడు బిల్లుల పేమెంట్స్ రెండు రకాలుగా పే చేయాలా..? ఏమిటీ అంటూ ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన పెరిగేంత వరకు రెండు రకాలుగా మీటర్లు వినియోగించుకోవచ్చనే విధంగా ప్రచారం చేస్తూ యామ చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం చాపకింద నీరులా స్మార్ట్ మీటర్లు బిగించుకుంటూ పోతున్నారు. అధికారంలోకి రావడం కోసం ఒక రకంగా, అధికారంలోకి వచ్చాక మరో రకంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



చీమకుర్తిలో విద్యుత్ శాఖ వారు అమర్చిన స్మార్ట్ మీటర్

కళ్లు లేని కబోదిలా కూటమి ప్రభుత్వం

● వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం కళ్లు లేని కబోదిలా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో శనివారం టంగుటూరు మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదిమూలపు సురేష్ పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్నానని, రేషన్ బియ్యం, ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా జరిగితే మీ సంగతి తేలుస్తానని హెచ్చరికలు చేస్తూనే.. టీడీపీ శ్రేణులకు వాటన్నింటినీ ఆదాయ మార్గాలుగా మార్చివేశారని విమర్శించారు. రేషన్ బియ్యం ఎల్లలు దాటుతున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తుండటమే అందుకు నిదర్శనమని ఆరోపించారు. కొండపి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ప్రతి నెలా రేషన్‌బియ్యం దందా చేసి 25 నుంచి 35 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక, గ్రావెల్ మాఫియా పేట్రేగిపోతోందన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేస్తే.. ఫిర్యాదు చేసినవారిపైనే కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.

పోలీసుల పనితీరు మరీ అధ్వానం...

కొండపి నియోజకవర్గంలో పోలీసుల పనితీరు మరీ అధ్వానంగా ఉందని ఆదిమూలపు సురేష్ విమర్శించారు. ఏ ప్రభుత్వంలో అయినా అధికారులు కొంతవరకు బెండ్ అవుతారని, కానీ, ప్రస్తుతం పూర్తిగా బ్యాక్ బెండ్ అవుతున్నారని అన్నారు. కొండపి సీఐ పనితీరే అందుకు ఉదాహరణ అన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓలు కూడా అధికార పార్టీ తొత్తులుగా మారారన్నారు. మద్యం టెండర్లలో దుకాణాలు వస్తే అధికార పార్టీ నాయకులు బెదిరించి లాక్కున్నారని ఆరోపించారు. మద్యం షాపుల వద్దే మద్యం సేవిస్తున్నారని, బెల్టుషాపులకు కొదవలేదని, ఎక్సైజ్ అధికారులు నిద్ర నటిస్తున్నారని విమర్శించారు. బెల్టు షాపు నిర్వహించాలంటే అధికారపార్టీ నాయకులకు కప్పం కట్టాల్సిందేనన్నారు.

ప్రజాసేవే మా లక్ష్యం...

అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాసేవే తమ ప్రధాన కర్తవ్యమని ఆదిమూలపు సురేష్ అన్నారు. కొండపిలో విద్యుత్ సమస్యలపై నిర్వహించిన పోరుబాట విజయవంతమైందని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇదే ఒరవడి కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతోందని, ఎల్లో మీడియానే అన్నీ తానై వ్యవహరిస్తోందని విమర్శించారు. మంత్రి మైక్ ముందు నిల్చుంటే చాలు.. స్క్రిప్టు ఎల్లో మీడియానే రాసుకుంటుందని ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీల పెంపుపై ఆందోళన చేస్తుంటే.. వైఎస్సార్ సీపీ పుణ్యమేనని ఉద్దేశపూర్వకంగా ఆరోపిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా జగనన్న జపం చేయడం మానలేదన్నారు. నియోజకవర్గంలో మంత్రి పర్యటనలో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ కనబడితే తట్టుకోలేకపోతున్నారని, సొంత స్థలంలో ఫ్లెక్సీ పెట్టుకున్నా తొలగించాలని పోలీసులతో బెదిరిస్తున్నారని సురేష్ మండిపడ్డారు. జగనన్న ఆదేశాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తున్నామని, కొండపి గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. సమావేశానికి మండలం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్ష పత్రాల మూల్యాంకనం

ఒంగోలు సిటీ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి సంబంధించి డిగ్రీ మూడో సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని ఒంగోలు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రారంభించనున్నట్లు క్యాంప్ ఆఫీసర్ డాక్టరు డి.కళ్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ, ఎకనామిక్స్, రాజనీతిశాస్త్రం మినహాయించుకుని మిగిలిన అన్ని సబ్జెక్టుల పేపర్లు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని ఒంగోలు, అద్దంకి, పొదిలి, కందుకూరు, దర్శి, చీరాల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులంతా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అపాయింట్మెంట్ ఐడీ కార్డు, పర్సనల్ ప్రొఫైల్, కళాశాల రిలీవింగ్ తీసుకుని రావాలని తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి సంబంధించిన అపాయింట్మెంట్ ఐడీ కార్డులు తమ కళాశాలలో ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లెటర్ ద్వారా ఐడీ కార్డులు పొందాలని తెలిపారు.

బెల్ట్ షాపుపై పోలీసుల దాడి

● 480 క్వార్టర్ బాటిళ్లు, 12 బీరు బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై మహేష్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురంలో బెల్ట్ షాపుపై స్థానిక ఎస్సై మహేష్ శనివారం సిబ్బందితో దాడి చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కంచర్ల చెన్నకేశవులును అదుపులోకి తీసుకున్నారు. అక్కడ విక్రయానికి సిద్ధంగా ఉంచిన 480 క్వార్టర్ బాటిళ్లు, 12 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

సర్పంచ్ ఆర్డర్ కాపీలో తప్పిదం

- అర్ధవీడు మండలం బదులు జే పంగులూరు మండలం అని నమోదు చేసిన అధికారులు
- అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉపసర్పంచ్ ఫిర్యాదు
- నూతన ఆర్డర్ కాపీ ఇవ్వడంలో జాప్యం చేస్తున్న ఉన్నతాధికారులు



పాపినేనిపల్లి సచివాలయం

అర్ధవీడు: మండలంలోని పాపినేనిపల్లి పంచాయతీకి రెండు నెలలుగా సర్పంచ్ ఎవరో అర్థంగాక ప్రజలు సతమతమవుతున్నారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పాపినేనిపల్లి గ్రామ సర్పంచ్‌గా నల్లబోతుల నాగమల్లేశ్వరి ఎన్నికయ్యారు. ఆమె గత మే నెలలో అనారోగ్య రీత్యా సెలవు పెట్టడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న కే అచ్చమ్మ సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్నారు. నల్లబోతుల నాగమల్లేశ్వరి సెప్టెంబరు 4వ తేదీ తన ఆరోగ్యం బాగుందని, తాను సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకుంటానని డీపీవోకు, ఎంపీడీవోకు అర్జీ పెట్టుకోవడంతో అదే నెల 20వ తేదీ డీపీవో ఇచ్చిన ఆర్డరు మేరకు ఆమె తిరిగి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే ఆమెకు ఇచ్చిన ఆర్డరు కాపీలో అర్ధవీడు మండలం అని ఉండాల్సిన చోట జె పంగులూరు మండలం అని ఉంది. ఆ విషయాన్ని చూపిస్తూ ఉప సర్పంచ్ కే అచ్చమ్మ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్డరు కాపీలో తప్పుగా పడి ఉన్న జె.పంగులూరు మండలం స్థానంలో అర్ధవీడు మండలం అని మార్చి ఇవ్వాలని నాగమల్లేశ్వరి రెండు సార్లు స్పందన కార్యక్రమంలో డీపీవోకు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ఉన్నతాధికారులు ఆమెకు ఆర్డరు కాపీ మార్చి ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఉప సర్పంచ్ మాత్రం తానే సర్పంచ్‌నని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఉప సర్పంచ్ అధికార పార్టీకి చెందిన మనిషి కావడంతో ఉన్నతాధికారులు కూడా నాగమల్లేశ్వరికి సర్పంచ్‌గా విధుల్లో చేరేందుకు ఆర్డరు కాపీ ఇవ్వకుండాపై జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నాగమల్లేశ్వరి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించేలా ఆర్డరు కాపీ ఇవ్వాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ నర్సయ్య మాట్లాడుతూ సర్పంచ్ నాగమల్లేశ్వరికి ఇచ్చిన ఆర్డరు కాపీలో మండలం పేరు తప్పుగా ఉండటంతో ఉప సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారన్నారు. పైఅధికారుల నుంచి ఆర్డరు కాపీ వచ్చిన వెంటనే నాగమల్లేశ్వరి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టవచ్చని తెలిపారు.

కార్పొరేటర్‌పై టీడీపీ నాయకుల దాడి

- అర్ధరాత్రి ఇంట్లో ఉండగా బయటకు పిలిచి కత్తులతో దాడి
- అధికార బలంతో దాడి చేశారని కార్పొరేటర్ కృష్ణలత ఆరోపణ



టీడీపీ నాయకుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న కార్పొరేటర్ భర్త వెంకటేష్

ఒంగోలు టౌన్: ఒంగోలులో మహిళా కార్పొరేటర్‌తో పాటు ఆమె భర్తపై దాడి జరగడం సంచలనం సృష్టించింది. బాధితురాలైన నగరంలోని 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత కథనం ప్రకారం... శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో భర్త తోటపల్లి వెంకటేష్‌తో ఇంటి దగ్గర కృష్ణలత ఉన్న సమయంలో టీడీపీకి చెందిన తోటకూర కృష్ణమూర్తి, మరికొందరు వచ్చి బయటకు పిలిచారు. బయటకు వచ్చిన వెంకటేష్‌పై దాడికి పాల్పడ్డారు. కర్రలు, కత్తులతో దాడి చేయడంతో అతని ముక్కు, తల, మెడపై గాయాలయ్యాయి. అడ్డొచ్చిన అతని భార్య, కార్పొరేటర్ తాడి కృష్ణలతపై కూడా దాడి చేశారు. ఆమె ఒంటిపై దుస్తులను కూడా చించివేశారు. గాయపడిన వెంకటేష్‌ను వెంటనే స్థానిక జీజీహెచ్‌కి తరలించారు. పాత కక్షలను మనసులో పెట్టుకుని అధికార పార్టీ అనే అహంకారంతో ఈ దాడి చేశారని కార్పొరేటర్ కృష్ణలత ఆరోపించారు. నిందితుడు కృష్ణమూర్తిపై గతంలో అనేక కేసులున్నాయని కృష్ణలత చెబుతున్నారు. కూటమిలో అంతా కలిసే పనిచేస్తున్నామని, ఇలాంటి ఘటనలు అపార్థాలు సృష్టిస్తాయని చెప్పారు. ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ వై.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

ఒంగోలు సబర్బన్: విద్యుత్ బిల్లులను ఆదివారం కూడా చెల్లించవచ్చని ఏపీసీపీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించడానికి వీలుగా జిల్లాలో విద్యుత్ బిల్లులు కట్టించుకునే అన్ని కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో బిల్లులు కట్టించుకునే కేంద్రాల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎస్‌ఈ కోరారు. విద్యుత్ బిల్లులు ఫోన్ పే, డిపార్ట్‌మెంట్ యాప్ ద్వారా కూడా చెల్లించవచ్చని తెలిపారు.